# సిరిపల్లె

అమలాపురానికి మూడు మైళ్ళలో కాలవగట్టున ఒక పల్లెటూరు. ఆ ఊరికి ఒకటే వీధి. పాత ఊరు వేరే వుంది. తక్కిన వర్ణాలవారంతా అక్కడే వుంటారు.

ఇది కొత్త వూరు. బ్రాహ్మలకోసం మాత్రమే ఆ వీధి. ఆ వీధిలో ఇంకే వర్ణాలవారూ లేరు.

సగం నియోగుల ఇళ్ళు, తక్కినవి వైదికులవి. ఒక ఏర్పాటుకోసం

రెండు తెగలు అనుకోవడంగాని అక్కడి నియోగు లందరివీ వైదికాచా రాలే. పొగతాగరు, స్నాన సంధ్యా ద్యనుష్ఠానాలు తప్పరు. గంధాక్షతలు ధరిస్తారు. వూళ్లో వున్నప్పుడు చొక్కాలు తొడగరు, ఉద్యోగాలు చెయ్యరు. ఒకరో ఇద్దరో తప్ప. అందరికీ కొంత పల్లపు భూమీ, కొంత కొబ్బరి తోటా వుంటుంది. శ్రద్ధగా వ్యవసాయం చేస్తారు లేక చేయిస్తారు.

అనోన్నదకాలకు లోటులేదు. ఎవరు వచ్చినా ఇంత పెడతారు. తాము తింటారు.

మా గురువుగారు నియోగులు. గంభీరమైన విగ్రహం. పొడుగుకు తగిన పుష్టి. స్నాన సంధ్యాదుల తర్వాత రామాయణ పారాయణం, పంచాయతన పూజ, ఆయన నిత్యకృత్యాలు. వేషం వైదికమైనా గొప్ప వ్యవహర్త. అటు అమలాపురం కోర్టు వ్యవహారాలూ, ఇటు సాహిత్య వ్యాసంగం సవ్యసాచిలా నిర్వహించేవారు. కాని— ఆ కోర్టు వ్యవహారాలే లేకపోతే సాహిత్యాన్ని ఏలేవారు !

రాతకోతల్లో మంచి ముసద్దీ. ఆయన రాసిన కాగితం ఢిల్లీకి వెళ్ళినా తిరుగులేదని చెప్పుకునేవారు.

పేరు చెప్పలేదుగదూ— ఆయన పేరు వీరయ్య శాస్త్రిగారు. ఆయనకు నేనొక్కణ్ణే శిష్యుణ్ని. ముందూ, వెనకా ఇంకొకరున్నట్టు వినలేదు. ఎట్లా దయగలిగిందో— నన్ను చేరదీసి నాలుగు కావ్యాలు, నాలుగు నాటకాలు చెప్పారు. కావ్యపాఠం రసప్రవాహం; నాటకం ఎదట ప్రదర్శనం చూస్తున్నట్లే ! పాఠం ఇంటిదగ్గర అరుదు. పొలం గట్టో, కొబ్బరి చెట్టో మా తరగతిగది.

గురువుగారు నన్ను పరాయిగా ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు కొడుకుల తరువాత మూడోవాణ్ని నేను !

పనిబట్టి ఆయన కదిలితే_ నేనూ వెంట వుండవలసిందే.

ముక్తేశ్వరం దగ్గర సిరిపల్లెలో వారి బంధువులింట పెళ్ళి వచ్చింది. గురువుగారి పీఠం కదిలింది. పిన్నిగారూ, కుమార్తెలూ ముందే వెళ్ళారు. పెద్దకొడుకు వారితో వున్నాడు.

గురువుగారు మర్నాడు బయల్దేరారు.

అమలాపురం దాకా కాలవగట్టున నడిచి వెళ్ళి, ఎర్రవంతెన దగ్గర గుర్రబ్బండీ ఎక్కి, సాయంత్రం చీకటి పడుతూండగా సిరిపల్లె చేరాం. పేరుకు సిరిపల్లెగాని పిల్ల కాలవ గట్టున అంతా పోగుచేసి అయిదారిళ్ళు ఆ గ్రామం సిరి! అంతా మోతుబర్లు, అన్నీ పాతకాలపు మండువా ఇళ్ళు. చెరువు లంతేసి పెరళ్ళు. అమలాపురం, ముక్తేశ్వరం రహదారి ప్రక్క ఆ ఊళ్ళో ఒక పెద్ద మండువా వారింట పెళ్ళి, నాలుగిళ్ళకు సరిపడా ఒకటే పెద్ద పందిరి. తెల్లటి చాందినీలతో రంగుకాగితపు బుట్టలతో అమోఘంగా అలంకరించారు.

ఇంకో పెద్ద భవంతిలో మా విడిది, మేం మొగ పెళ్ళివారి తరఫు గాబోలు! పందిట్లో మేజువాణీ జరుగుతోంది. ఆనాటి సాహిత్య రసికులకు మేజువాణీ నిషేధం లేదు. బావ వరసవాళ్ళు గురువుగారిని ముందు కూర్చో బెట్టారు. ఆ రోజుల్లో మేజువాణీ ముందు కూర్చోడం అంటే - తమాషా

కాదు. వేషాన్నిబట్టి, హోదానిబట్టి మేళనాయకురాలు ముందు కూర్చున్న వారి మీద అభినయం పడుతుంది. తొణక్కూడదు; బెణక్కూడదు; నాయకురాలు పట్టే కొంటె హస్తముద్రలు తనమీదే అనుకోకూడదు. అభినయం పట్టడమంటే భరతం పట్టడం అన్నమాటే—

పెదవి మీదకు చిరునవ్వు కూడా జారకూడదు.

రసజ్ఞుడైన శ్రీశుకుడిలా కూర్చోవాలి.

గురువుగారు ఎక్కడికేనా బయలుదేరితే నిండుబొత్తాల నల్లకోటు తొడిగి దానిమీద సన్నజరీ పట్టు ఖండువా వేసేవారు.

నాయకురాలి పదాభినయానికీ, భావ ప్రదర్శనకీ గురువుగారి మెప్పు లభించింది. ప్రౌఢ అయిన నాయకురాలు స్మితముఖి అయింది.

భోజనాలకి పిలుపులొచ్చాయి. బంధువర్గమంతా కలిసి వెండి చెంబులతో, పట్టుబట్టలతో గాస్లైటు వెలుగులో బాండుమేళం దర్జాతో భోజనాలకు వెళ్ళాలి. నా మెడమీద పొడి అంగవస్త్రం తప్ప పట్టువాసనలేదు. పిన్నిగారికి నామర్దా అనిపించింది. తమ పిల్లల పట్టుతాపితాలలో మంచిది తీసి కట్టుకోమని— పెద్ద వెండిగ్లాసు చేతికిచ్చారు. అప్పుడు నేను విద్యార్థిని గాను, వారి ముఖ్య బంధువును!

మర్నాడు ఉదయం — చీకటితోటే ఊరి పక్క ఉన్న 'డామ్' దగ్గర పిల్లకాలవ గట్టు చెంత ప్రాతఃకాల కృత్యాలు తీర్చుకుని స్నానానికి దిగాం. గురువుగారి పెద్దబ్బాయి పక్కనే స్నానం పూర్తిచేసి తుడుచుకుంటు న్నాడు. నేను ఒక్క అడుగు ముందుకువేసి మునిగిపోయాను, నీటిలో

కొట్టుకుంటున్నాను. కళ్ళనిండా నీటి తెరలు – ఏమీ కనిపించదు. తృణం దొరికితే చాలు. పట్టుకుందామని తహ తహ. దిక్కుతోచక తడుము కుంటున్నాను.

పెద్దబ్బాయి చూశాడు. చెంగున దూకి జుట్టు పట్టుకున్నాడు ఇంకె క్కడ పట్టుకున్నా మునిగినవాడు వాటేసుకుని కదలనివ్వడు. ఇద్దరికీ చావు ఖాయం. మునిగినవాడు కొంచెం అలిసి పట్టుకునే శక్తిహీనుడు కావాలి. అప్పుడు ఒడ్డుకు సునాయాసంగా లాగవచ్చు. ఆ అబ్బాయి అల్లాగే చేసి ఒడ్డున పడేశాడు.

నీళ్ళేమీ తాగలేదు. తేరుకుని అతనితో విడిదిలోకి వెళ్ళాను.

ఇద్దరం ఏమి ఎరగనట్టు పెళ్ళివారు అప్పుడే పంపిన వేడివేడి ఉప్మా ఇష్టంగా తింటున్నాం.

కాలవలో నేను మునిగిపోవడం చూసిన ఒకాయన పక్కవారితో "పాపం ఈ ఉప్మా తినే యోగం ఉంది. ఈ అబ్బాయికి. క్షణం కిందట మృత్యువు ముఖంలో నుంచి బయటపడ్డాడు. ఎంత ఆప్యాయంగా తింటు న్నాడో" అంటున్నాడు. లోపల నవ్వుకున్నాను.

చావుకీ, బతుక్కీ ఒక సన్నని రేఖే అడ్డం కాబోలు !

మధ్యాహ్నం విందు భోజనం కూడా చేసి స్వగ్రామం బయలు దేరాం.

అట్లా – గురువుగారు విద్యాదానంచేస్తే గురుపుత్రుడు నాకు ప్రాణ దానం చేశాడు.